క్లుప్తంగా

పాకల బీచ్‌లో పర్యాటకుల సందడి


పాకల బీచ్‌లో సముద్రస్నానాలు చేస్తున్న పర్యాటకులు

సింగరాయకొండ: పాకలబీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. కార్తీకమాసం కావటంతో ఉదయం నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మండలంతో పాటు ఇతర ప్రాంతాల వారు కూడా కుటుంబ సభ్యులతో కలిసి తీరానికి వచ్చి సముద్రస్నానాలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అసభ్యకర పోస్టింగ్‌లు పెడితే చర్యలు

సీఎస్‌పురం(పామూరు): సోషల్ మీడియాలో ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలపై అసభ్యకరపోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్.సుమన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసభ్యక పోస్టులతో వారి వారి మనోభావాలను దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ


నల్లమడుగులలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని నల్లమడుగుల గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను వైఎస్సార్ సీపీ నాయకుడు సూరిపోగు ఆథోని ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బలబద్ర శ్రీను, రవి, రాజు, కోటయ్య, ఉద్యోగ సమాఖ్య నాయకులు ఏలియా మాట్లాడుతూ సోమవారం ఒంగోలులో జరిగే ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం


పాఠశాల గేటు వద్ద పగిలిపోయి ఉన్న డ్రైనేజీ శ్లాబు

కందుకూరు రూరల్: కందుకూరు ఓవీ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గేటు వద్ద డ్రైనేజీ శ్లాబు పగిలిపోయింది. పాఠశాలలో నుంచి బాలికలు ఎవరైనా అటు వెళితే అందులో పడే అవకాశాలున్నాయి. విద్యార్థినులు సైకిళ్లు ఆ డ్రైనేజీపై పార్కింగ్ చేస్తుంటారు. ఆ సమయంలో కూడా పొరపాటున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి పగిలిపోయిన డ్రైనేజీ శ్లాబుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఇష్టంగా చదవండి

ఉలవపాడు: ప్రతి ఒక్కరూ ఇష్టంగా చదవాలని స్థానిక గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. పుస్తకాలను చదివి జ్ఞానం సంపాదించాలని సూచించారు. నీతి కథలు, మహనీయుల చరిత్ర చదివించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉలవపాడు: అక్రమంగా తరలివెళుతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఈ సంఘటన జాతీయరహదారి పై కరేడు ర్యాంపు వద్ద జరిగింది. ఉలవపాడు ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తున్న సమయంలో ఆటోలో కరేడు గ్రామానికి చెందిన సంకే దయాకర్, గొల్లపోతు శ్రీనులు 20 కేజీలతో నిండిఉన్న 22 బస్తాల పీడీఎస్ బియ్యం (4 క్వింటాళ్లు) ఒంగోలు వైపునకు తీసుకుని వెళుతుండగా తనిఖీ చేసి రేషన్ బియ్యంగా గుర్తించి ఆటోను స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

లింగసముద్రం: కార్తీక పౌర్ణమి రోజు ధ్వజస్తంభంపై వెలిగించే కార్తీక దీపం విశిష్టత గురించి.. త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండల కేంద్రమైన లింగసముద్రంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసం డిసెంబరు 1వ తేదీ వరకు ఉంటుందని అందరూ భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి యోగ సాధన చేయడానికి గుర్తుగా దీపం వెలిగించాలని వివరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జి.ప్రసాద్, జి.సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.


తల్లిదండ్రులకు చెట్లనీడే గతి


భోజనశాలలో బల్లలు, ఫ్యాన్లు లేని దృశ్యం


దండెలు లేక నేలమీదే ఆరేసుకున్న దుస్తులు

వసతుల్లేవ్.. అన్నీ సమస్యలే..!

- వసతులకు దూరంగా జరుగుమల్లి సాంఘిక సంక్షేమ హాస్టల్
- 184 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లే దిక్కు..
- మంచాలు లేక నేలపైనే నిద్ర


మంచాలు లేకపోవడంతో ఈ నేలపైనే నిద్రించేది..


పనిచేయని వాటర్‌ప్లాంటు

జరుగుమల్లి(సింగరాయకొండ):

మండలంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహంలో వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని హాస్టళ్లలో కనీస వసతులు లేకపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో విద్యార్థినుల పడే బాధలు చెప్పేవీ కావు.

అరకొర వసతులే..

వసతిగృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 184 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ తొమ్మిది గదులు ఉండగా ప్రస్తుతం 6 గదులు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. వసతి గృహంలో 20 మరుగుదొడ్లు, 20 స్నానాల గదులు ఉండగా వాటిలో 3 మరుగుదొడ్లు మాత్రమే ఉపయోగంలో ఉండగా, స్నానాల గదుల్లో కొన్ని మాత్రమే వాడుకలో ఉండగా వాటిలో మూడు మరుగుదొడ్లలో సరిగా నీరు పోక దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఇక విద్యార్థినులు నిద్రించేందుకు మంచాలు లేకపోవడంతోనే నేలమీదే నిద్రించాలిస్న పరిస్థితి. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తూ చలికాలం కూడా మొదలు కావడంతో చలికి నేలపైనే నిద్రించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచాలు కేటాయించినా అవి ఎత్తులో ఉన్నాయని, విద్యార్థినులు పైన పడుకుంటే ఫ్యానులు తగిలి గాయపడే అవకాశం ఉండటంతో మంచాలు స్టోర్‌రూమ్‌లో భద్రపరిచారు. ఆ తరువాత అధికారులు ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఒక్కో గదిలో 30 మంది విద్యార్థినులు ఉంటుండగా ఫ్యాన్లు కూడా అరకొరగానే ఉన్నాయి. కొన్ని గదుల్లో ఫ్యానే పనిచేయడం లేదు. వసతి గృహంలో భోజనాలు సక్రమంగా ఉడకకుండానే వడ్డిస్తున్నారని విద్యార్థినులు వాపోతున్నారు. వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు గురి కావడంతో బయట నుంచి నీరు కొనుగోలు చేస్తున్నారు. వసతిగృహంలోని వాటర్‌ట్యాంకు శుభ్రం చేయకపోవటంతో శుభ్రంగా ఉండటం లేదని ఆ నీరే తాగాల్సి వస్తుందని ఒక్కోసారి ఆనీరు చాలక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులు వచ్చినా షెల్టర్ లేకపోవడంతో చెట్ల కిందే ఉండాల్సి వస్తోంది. వసతి గృహానికి ప్రభుత్వ నిధులు రూ.1.50 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో మరమ్మత్తులు చేస్తామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెప్పారని వార్డెన్ రంగలక్ష్మమ్మ తెలిపారు.


దుర్గంధభరితంగా ఉన్న మరుగుదొడ్లు.

ఓటర్ స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన


కలికవాయలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్


కోవిలంపాడు పీఎస్‌లను తనిఖీచేస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి


నందనవనంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహశీల్దార్

సింగరాయకొండ: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఆదివారం ఓటర్ నమోదు, సవరణలకు సంబంధించి బీఎల్‌ఓలతో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన వచ్చింది. స్పెషల్ డ్రైవ్‌కు మొత్తం 152 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు. ఫారం- 6కు 12 అర్జీలు, ఫారం- 7కు 27 అర్జీలు, ఫారం- 8కు 113 అర్జీలు పేర్కొన్నారు. కనుమళ్ల, కలికవాయ, శానంపూడి పోలింగ్ బూత్‌లను పరిశీలించి బీఎల్‌ఓలకు తగు సూచనలిచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్‌ఐ ప్రసాద్, బీఎల్‌ఓ వీరేంద్ర పాల్గొన్నారు.

పీసీపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ హక్కు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా పీసీపల్లి మండలం పెదఅలవలపాడు, పీసీపల్లి, పెదవరిమడుగు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఉషతో కలిసి ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఓటర్ల జాబితాలో తప్పులు, బూతుల మార్పు కోసం కూడా ప్రత్యేక ఓటు నమోదులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలంతా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు బూత్‌ల వద్ద అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

సీఎస్‌పురం(పామూరు): ఓటు ఆవశ్యకతను ప్రజలు ముఖ్యంగా యువత గుర్తెరగాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని ఆదివారం తనిఖీచేశారు. మండలంలోని కోవిలంపాడులో పోలింగ్‌స్టేషన్‌లు 86, 87లలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు నిండిన వారంతా నూతనంగా ఓటుకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరైనా పలుచోట్ల ఓటు కలిగి ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలోని పేర్లలో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని, ఇది ఓటర్లకు సువర్ణావకాశమన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): ఓటరు నమోదు, సవరణలకు సంబంధించి బీఎల్‌ఓలతో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 127 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.జనార్దన్ తెలిపారు. ఫారం-6కు 16 అర్జీలు, ఫార-7కు 13 అర్జీలు, ఫారం-8కు 98 అర్జీలు వచ్చినట్లు వివరించారు. వావిలేటిపాడు, దావగూడూరు, నందనవనం పోలింగ్ బూత్‌లను పరిశీలించి బీఎల్‌ఓలకు తగిన సూచనలు ఇచ్చినట్లు తహసీల్దార్ వివరించారు. బీఎల్‌ఓ అనిత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు


మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

కనిగిరి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేయనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం కనిగిరి పట్టణ ఆరవ మహాసభలు కె.కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, ఎం రమేష్, కే రమాదేవి మాట్లాడుతూ వెనుకబాటు గురైన కనిగిరి పట్టణ అభివృద్ధికి ప్రణాళికా ప్రకారం పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. నిమ్జ్, ట్రిపుల్ ఐటీ, నడికుడి కాళహస్తి, రైల్వే లైన్‌ను పూర్తి చేయాలని, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలను మంజూరు చేయాలని, కనిగిరి పెద చెరువు, నాగుల చెరువులను సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లుగా మార్చాలని, ఇంటింటికి నల్లా ద్వార సురక్షిత సాగర్ జలాలు అందచేయాలని, వలసల నివారణకు పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ సమగ్రాభివృద్ధికి రానున్న రోజుల్లో కమ్యునిస్టులు విస్తృత పోరాటాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తొలుత సీపీఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి జెండా ఆవిష్కరణ చేయగా, తర్వాత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు పీసీ కేశవరావు, వై కొండలరావు, జి.శ్రీనివాసులు, కె.శాంతకుమారి, ఆర్ ఏడుకొండలు, యు పిచ్చయ్య, నరేంద్ర, వెంకటమ్మ, ప్రసంగి, రాజు, సీహెచ్ ప్రసాద్, ఎస్‌కే ఖాదర్ వలి, రమణమ్మ, కే వెంకటేశ్వర్లు, ఎం ఆదినారాయణ, పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే ఖాజావలి

కనిగిరి రూరల్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్థానిక శ్రీనివాస థియేటర్ ప్రాంగణంలో ఆదివారం ఎస్సై టి.శ్రీరాం అధ్యక్షతన వ్యాపారులు, వాహన చోదకులకు, ప్రజలకు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ ఖాజావలి మాట్లాడుతూ వ్యాపారులు, దుకాణదారులు కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రద్దీగా ఉంటే ఏరియాల్లో రెండు వారాలు ఒక వైపు, రెండు వారాలు మరో వైపు వాహనాల పార్కింగ్ చేసుకోవాలన్నారు. రోడ్లపై నిర్లక్ష్యంగా పశువులను వదిలేస్తే యజమానులపై చర్యలు ఉంటాయన్నారు. ఎస్సై టి.శ్రీరాం మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకోత్సవం


అభిషేకోత్సవంలో పాల్గొన్న ఛైర్మన్, ఈఓ, భక్తులు


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఛైర్మన్, ఈఓ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, గోపూజ, మహానివేదనం అర్చకులు మంకాల శివప్రసాద్ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు వేద మంత్రాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి ఆలయాన్ని ఏపీ సచివాలయం ఎన్నికల కమిషన్ కార్యాలయ సెక్షన్ ఆఫీసర్ కొండారెడ్డి దర్శించుకోగా ఆయనకు స్వామి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఛైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలగక ఇక్కట్లు


చిమ్మ చీకటిని తలపిస్తున్న కొండపి లోని ప్రధాన రహదారి

కొండపి: నియోజకవర్గ కేంద్రమైన కొండపి ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణదారులు రాత్రి 8:30 గంటలకు షాపులు మూసివేయడంతో కొండపిలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కామేపల్లి సెంటర్ వరకు రోడ్లు చిమ్మ చీకటిని తలపిస్తున్నాయి. అసలే వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతుంటే దీనికి తోడు కుక్కలు గుంపులు, గుంపులుగా ఉంటున్నాయి. పాదచారులు, వాహనదారులు ప్రయాణిస్తున్నప్పుడు కుక్కలు వారిని వెంబడిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్న అధికారులు ఇప్పటివరకు స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగించాలని కొండపి ప్రజలు కోరుకుంటున్నారు.

హాజీపురం ఎస్సీకాలనీలో తాగునీటి కష్టాలు

- నెల రోజులుగా మూలనపడిన బోరు
- మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు


హాజీపురం ఎస్సీకాలనీలో మరమ్మతులకు గురైన బోరు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం ఎస్సీకాలనీలో నెల రోజులగా తాగునీటికి కష్టాలు పడుతున్నారు. నీటి కష్టాల గురించి సచివాలయ సిబ్బంది, కార్యదర్శికి తెలియజేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామంలోని డీప్‌బోర్ మోటార్ కాలిపోయింది. దీంతో తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సాగర్ నీరు కూడా సరఫరా నిలిచిపోయింది. బోరుకు మరమ్మతులు చేయాలని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించి కాలనీవాసులు నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

అంతా మా ఇష్టం


టంగుటూరులో మద్యం దుకాణం ఎదురుగా మద్యం తాగుతున్న మందుబాబులు

- మద్యం దుకాణాల్లో సమయపాలనకు చెల్లుచీటి
- దుకాణాల వద్దే మద్యం తాగుతున్న మందుబాబు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు

టంగుటూరు: కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రైవేట్‌పరం చేయడంతో ఒక్కసారిగా మొత్తం మారిపోయింది. గతంలో కేవలం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వం సూచించిన సమయాల్లోనే మద్యంఅమ్మకాలు సాగేవి. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంతో సమయపాలనకు చెల్లుచీటి ఇచ్చేశారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు మద్యం దుకాణాల వద్దే మందుబాబులు తాగుతుండటంతో ఇటీవల కాలంలో ప్రమాదాలు ఎక్కువయ్యాయి. రెండు మద్యం దుకాణాలు కూడా జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో నిత్యం అటుగా వెళ్లే మహిళలు, విద్యార్థులు మందుబాబుల ఆగడాలకు ఇబ్బందులు పడుతున్నారు. మందుబాబులు మద్యం దుకాణాల వద్ద తాగకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు గాలికొదిలేసి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉంచాలి. ఒక వ్యక్తికి మూడు బాటిళ్లు మాత్రమే ఇవ్వాలి. దుకాణాల వద్ద మద్యం తాగడానికి వీల్లేదు. కానీ ఇవేమీ మద్యం దుకాణాల్లో అమలుకావడం లేదు. టంగుటూరులోని ఓ మద్యం దుకాణం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. విషయం ఎక్సైజ్ శాఖాధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక ఈ రెండు దుకాణాల పరిధిలో పదుల సంఖ్యలో ఏర్పాటైన బెల్టుషాపులకు నిత్యం మద్యం సరఫరా అవుతోంది. అయినా అధికారులకు ఇవేమీ పట్టడం లేదు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి


హైందవ శంఖారావం ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

పామూరు: విజయవాడలో జనవరిలో జరిగే హైందవ శంఖారావంను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ చెంచురామయ్య అన్నారు. స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం జరిగిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తిచేసి స్వయంప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక సంస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి మద్దతుగా 2025 జనవరి 05వ తేదీన విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా శంఖారావం బహిరంగసభ ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీ రమణయ్య, వరదా ఓటులేసు, దరిశి సత్యనారాయణ, కొట్టే వెంకటేశ్వర్లు. పి.శ్రీనివాసులు, యు.శ్రీను, పి.విజయకుమారాచారి, జమకాల నరేష్, పామూరు, సీఎస్‌పురం, వరికుంటపాడు మండలాల విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com